క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న ఆలయ ధర్మకర్త తిరుపతినాయుడు దంపతులు

దత్తిరాజేరు: మండలంలోని దత్తి గ్రామంలో శ్రీదేవి,భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం బుధ వారం ఘనంగా నిర్వహించారు.ఆలయ ధర్మకర్త పెంకి తిరుపతినాయుడు, లక్ష్మి దంపతులతో అర్చకులు హరికృష్ణమాచా ర్యులు తొలిపూజ చేయించారు. అనంతరం 108 కళశాలతో అభిషేకం, శాంతి హోమం,తదితర పూజా కార్యక్రమాలు నిర్వ హించారు.అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

వైభవంగా మరిడిమాంబ విగ్రహ ప్రతిష్ఠ



అమ్మవారికి పూజలు చేస్తున్న ఆలయ ధర్మకర్త శ్రీను, భక్తులు

వేపాడ: మండలంలోని కృష్ణారాయుడుపేట పంచాయతీ అంకాజోస్యులపాలెంలో నూతనంగా నిర్మించిన మరిడిమాంబ ఆలయంలో అమ్మ వా రి విగ్రహ ప్రతిష్ఠోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త బోజంకి శ్రీనుతో పురోహితులు విగ్రహ ప్రతిష్ఠ చేయించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద భక్తులకు మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకోవడంతో పాటు అన్నప్రసాదం స్వీకరించారు. విగ్రహ ప్రతిష్ఠోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం, బైటోభజన, దాటు భజనలు ఆకట్టుకున్నాయి.

ఈదురుగాలుల బీభత్సం



సోమలింగాపురంలో నేలకొరిగిన అరటి పంట

మెరకముడిదాం: మండలంలో బుధవారం సాయంత్రం వీచిన ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. మండలంలోని సోమలింగాపురం, గొల్లలమ్రివలస, మెరకముడిదాం, శ్యామాయవలస, ఊటపల్లి, తదితర గ్రామాల్లో మామిడి, అరటితోటలు, మొక్కజొన్న పంటలు నేలమట్టమయ్యాయి. దీంతో బాధిత రైతులు లబోదిబోమంటున్నారు. అకాల వర్షానికి, ఈదురుగాలులకు పంటలు నేలపాలవ్వడంతో రైతులు బోరున విలపిస్తున్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘ కార్యాలయం భవనం పైకప్పు రేకులు మొత్తం గాలికి ఎగిరిపోవడంతో వర్షానికి రికార్డులు తడిచి ముద్దయ్యాయి.

వలంటీర్ల రాజీనామా



రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శికి అందజేస్తున్న వలంటీర్లు

వేపాడ: మండల కేంద్రం వేపాడకు చెందిన ఏడుగురు వలంటీర్లు బుధవారం రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి గొరికి అందజేసి, ఎంపీడీఓకు పంపించాలని ఆమెను కోరారు. రాజీనామా చేసిన వలంటీర్లు మాట్లాడుతూ ప్రజలకు సేవ చేసే అవకాశం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తమకు కల్పించారని అన్నారు. సీఎం జగన్ ఆశయాలకు అనుగుణంగా తమకు కేటాయించిన కుటుంబాలకు ఇన్నాళ్లూ నిస్వార్థంగా సేవలందించామని చెప్పారు.ఎన్నికల కమిషన్ ద్వారా తమ సేవలను కొందరు అడ్డుకోవడంతో రాజీనామా చేశామని తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

గుర్ల: మండలంలోని గుర్ల సబ్ స్టేషన్ పరిధిలోని కెల్ల, బెల్లానపేట, మణ్యపురిపేట, సొలిపిసోమరాజుపేట, గరిడ గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు విద్యుత్ శాఖ డీఈ పి.హరి బుధవారం తెలిపారు. ఆయా గ్రామాలకు చెందిన 11కేవీ లైన్ల మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎల్.కోట మండలంలో..

లక్కవరపుకోట: ఎల్.కోట, మల్లివీడు సబ్‌స్టేషన్‌ల పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం ఆయా ఫీడర్‌ల పరిధి గ్రామాలకు శుక్రవారం ఉదయం 7గంటల నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ ఐ.కృష్ణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.ఎల్.కోట ఫీడర్ పరిధిలో ఎల్.కోట, సొంపురం జంక్షన్, సంతపేట గ్రామాలకు, మల్లివీడు సబ్ స్టేషన్ పరిధిలో ఆర్.జి.పేట, కొత్తపాలెం, జమ్మాదేవిపేట, దాసుళ్లపాలెం, గేదులవానిపాలెం, గనివాడ, వేచలపువానిపాలెం, తామరాపల్లి, మార్లాపల్లి, లింగంపేట, చందులూరు, కిత్తన్నపేట గ్రా మాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రతీ కుటుంబానికి మేలు చేశాం

- అవినీతి రహిత పాలన అందించాం
- టీడీపీ బూటకపు హామీలను నమ్మవద్దు
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అప్పలనరసయ్య



గొల్లుపాలెంలో నిర్వహించిన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య, ప్రచారరథంపై ఎంపీ బెల్లాన, ఎమ్మెల్సీ సురేష్ బాబు

బొండపల్లి: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పార్టీలకతీతంగా ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా మేలు జరిగిందని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మండలంలోని గొల్లుపాలెం గ్రామంలో బుధవారం సాయంత్రం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పి.సూర్యనారాయణరాజు(సురేష్‌బాబు)తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామస్తులు వారికి ఘనస్వాగతం పలికారు. గ్రామంలో ర్యాలీ చేశారు. అనంతరం నిర్వహించిన సభలో ప్రచార రథంపై నుంచి ఎమ్మెల్యే అప్పలనరసయ్య మాట్లాడుతూ అవినీ తి, అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా పాలన సాగించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి తిరిగిపట్టం కట్టాలని ప్రజలను కోరారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని అన్నారు. గత టీడీపీ పాలన లో అరకొరగా అమలు చేసిన పథకాలను సైతం ప్రజలకు మంజూరు చేసేందుకు జన్మభూమి కమిటీ సభ్యులు లంచాలు వసూలు చేసేవారని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ పాలనలో అర్హతే ప్రామా ణికంగా పథకాలను లబ్ధిదారులకు వలంటీర్ల ద్వారా అందజేయించామని, ఎక్కడా ఒక్క రూపాయి అవినీతి జరగలేదని చెప్పారు. నిస్వార్థంగా సేవలందిస్తున్న వలంటీర్లపై టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు లేనిపోని ఆరోపణలు చేశారని, ఇప్పుడు ఎన్నికలు రావడంతో టీడీపీ అధికారంలోకి వస్తే వలంటీర్ వ్యవస్థను కొనిసాగిస్తానని, వారి జీతాలు పెంచుతామని కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారని మండిపడ్డారు. ప్రజలను మోసం చేయడం చంద్రబాబు నైజమని, ఆయన ఇచ్చే హామీలు, చేసే వాగ్దానాలను నమ్మవద్దని ప్రజలకు సూచించారు.

రూ.1,800 కోట్లతో అభివృద్ధి, సంక్షేమం

నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఐదేళ్లలో అభివృద్ధి, సంక్షేమం జరిగిందని ఎమ్మెల్యే అప్పలనరసయ్య అన్నారు. మన బడి నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటు గా తీర్చిదిద్దామని చెప్పారు. పేదింటి పిల్లలు కూడా ఇంగ్లిష్ మీడియంలో చదువుకోవాలని ప్రభుత్వ పాఠశాలల్లో సీఎం జగన్ ఇంగ్లిష్ మీడియం విద్యను అమలు చేశారన్నారు. నియోజకవర్గంలో రూ.1,800 కోట్లను అభివృద్ధి పనులు, ప్రజల సంక్షేమానికి వెచ్చించామని పేర్కొన్నారు. గ్రామాలకు కొత్తగా తారురోడ్లు వేయడంతో పాటు అధ్వానరోడ్లను పున రుద్ధరించామని, గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, కాలువలు, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ వెల్‌నెస్ సెంటర్ భవనాలను నిర్మించా మని, ఆస్పత్రులను అభివృద్ధి చేశామని చెప్పారు. ఎన్నికల సమయం కావడంతో టీడీపీ నాయకులు గ్రామాల్లోకి వస్తున్నారని, కరోనా కష్ట కాలంలో వీరంతా ఎక్కడున్నారో చెప్పాలని వారిని నిలదీయాలని ప్రజలకు సూచించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధి ని గుర్తించి మే 13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను, విజయనగరం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బెల్లాన చంద్రశేఖర్‌ను గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.వి.ప్రభూజీరాజు,ఎంపీపీ చల్లా చలంనాయుడు, ఏఎంసి చైర్మన్ వేమలి ముత్యాలునాయుడు, జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు, పార్టీ మండల అధ్యక్షుడు బొద్దల చిన్నంనా యుడు, వైస్ ఎంపీపీ గొండేల ఈశ్వరరావు, మాజీ ఎంపీపీ బండారు బంగారం, నియోజకవర్గ జేసీఎస్ ఇన్‌చార్జ్ ఈదుబిల్లి కృష్ణ, నాయకులు బొత్ససాయి గురునాయుడు, పోతల కన్నంనాయుడు, పల్లి రామునాయుడు, తొత్తడి సత్తిబాబు, గొల్లు సతీష్, పల్లి రఘు, మూకల చలంనాయుడు పాల్గొన్నారు.

మందు కళ



అంజనేయపురం మద్యం దుకాణం వద్ద ఎగబడుతున్న టీడీపీ కార్యకర్తలు



అంజనేయపురంలో మద్యం దుకాణం పక్కన పాన్‌షాప్ వద్ద బహిరంగంగా మద్యం సేవిస్తున్న టీడీపీ కార్యకర్త

- మద్యం దుకాణాలకు ఎగబడిన టీడీపీ కార్యకర్తలు
- టీడీపీ కండువా, టోపీ వేసుకుని బహిరంగంగా మద్యపానం
- 'కళా' నామినేషన్ సందర్భంగా ఏరులైపారిన మద్యం
- యథేచ్ఛగా ఎన్నికల కోడ్ ఉల్లంఘన
- తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలోకి టీడీపీ కార్యకర్తలు

చీపురుపల్లి: టీడీపీ చీపురుపల్లి అభ్యర్థి కళావెంకటరావు నామినేషన్ ఘట్టం అంతా మందుమయంగా మారింది. చీపురుపల్లిలో బుధవారం మద్యం ఏరులై పారింది. నామినేషన్‌కు జనాలను రప్పించడం కోసం ముందే డబ్బులు పంపిణీ చేయడంతో మందుబాబులు పార్టీ కండువాలు, టోపీలతో మద్యం దుకాణాల వద్ద క్యూ కట్టారు. బహిరంగంగానే మద్యం సేవించారు. ఇది చూసిన వారు మందు'కళ' బాగుందంటూ వ్యాఖ్యానించారు. నామినేషన్ పేరుతో ఇంటి మగవారికి మందు ఇచ్చి ఆరోగ్యాన్ని పాడుచేసేందుకు పూనుకున్న కళాను పలువురు మహిళలు చీవాట్లు పెట్టారు. కొందరు మందుబాబులు పీకలదాకా తాగి రచ్చచేయడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు.

కళా నామినేషన్‌లో కోడ్ ఉల్లంఘన

టీడీపీ అభ్యర్థి కిమిడి కళా వెంకటరావు నామినేషన్ సందర్భంగా ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరిగిందని స్థానికంగా చర్చ జరుగుతోంది. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో పార్టీ కండువాలు, జెండాలు, టోపీలతో ప్రభుత్వ కార్యాలయాల్లోకి వెళ్లకూడదు. టీడీపీ కార్యకర్తలు కండువాలు, టోపీలు పెట్టుకుని స్థానిక తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో చొచ్చుకెళ్లారు. తహసీల్దార్ కార్యాలయ ప్రవేశ ద్వారం నుంచి కార్యాలయం వరకు కార్యకర్తలు టోపీలు, కండువాలతో కనిపించారు. దీంతో కోడ్ ఉల్లంఘనలోకి వస్తుందని స్థానికంగా చర్చ జరిగింది. కోడ్ అమల్లో ఉండడంతో ఇలాంటి సందర్భాల్లో పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం, మేజర్ పంచాయతీ కార్యాలయాల వద్ద గేట్లు మూసి కార్యాలయం పనిపై వచ్చిన వారిని మాత్రమే అనుమతిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణం అంతా పచ్చ కండువాలు, టోపీలతో నిండిపోవడంతో కోడ్ ఉల్లంఘనలోకి వస్తుందో రాదో అధికారులే తేల్చాల్సి ఉంది. ఇదే విషయమై తహసీల్దార్ ఎస్.ప్రసాద్ వద్ద ప్రస్తావించగా తమ కార్యాలయం వద్ద గేట్లు లేవని, కోడ్ ఉల్లంఘనలోకి వస్తుందో రాదో పరిశీలన చేయాల్సి ఉందన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో టీడీపీ కార్యకర్తలు

సీఎం జగన్‌కు మద్దతివ్వండి



చీపురుపల్లి రూరల్ (గరివిడి): గొట్నందిలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



లక్కవరపుకోట: దాసుళ్లపాలెంలోప్రచారం చేస్తున్న పార్టీ మండల అధ్యక్షుడు సత్యనారాయణ



శృంగవరపుకోట: ఎస్.కోటలో ప్రచారం చేస్తున్న మహిళా నేతలు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటేసి సంక్షేమ ప్రదాత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలవాలని ఏఎంసీ మాజీ చైర్మన్ మీసా ల విశ్వేశ్వరరావు ప్రజలను కోరారు. గరివిడి మండలంలోని గొట్నంది గ్రామంలో బుధవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంక్షేమంతో పాటు అభివృద్ధి కొనసాగాలంటే జగన్ మోహన్‌రెడ్డి సీఎంగా కొనసాగాలని అన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి చీపురుపల్లి ఎమ్మెల్యేగా బొత్స సత్యనారాయణను, విజయనగరం ఎంపీగా బెల్లాన చంద్రశేఖ ర్‌ను గెలిపించాలని అభ్యర్థించారు.పీఏసీఎస్ అధ్యక్షుడు లెంక శ్రీరాములు, స్థానిక సర్పంచ్ లోపింటి రాంబాబు, ఎల్లంటి పోలీస్ నాయుడు పాల్గొన్నారు.

అఖండ మెజార్టీతో గెలిపించాలి

లక్కవరపుకోట: సంక్షేమ, అభివృద్ధి పాలన సీఎం జగన్‌తోనే సాధ్యమని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గుమ్మడి సత్యనారాయణ అన్నారు. మండంలోని దాసుళ్లపాలెం గ్రామంలో మంగళవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎస్.కోట ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న కడుబండి శ్రీనివాసరావు, విశాఖపట్నం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బొత్స ఝాన్సీలక్ష్మిని అఖండ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. గ్రామ సర్పంచ్ ముమ్మన ధనలక్ష్మి,నాయకులు ముమ్మన ప్రసాదరావు, గోపాలరావు, గుమ్మడి స్వాతి కుమారి పాల్గొన్నారు.

అతివల ప్రచారం

శృంగవరపుకోట: ముఖ్యమంత్రిగా జగనన్నను ఆశీర్వదించాలని కోరుతూ ఎస్.కోట పట్టణంలోని శ్రీనివాసకాలనీలో మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, ఎస్.కోట జెడ్పీటీసీ ఎం.వెంకటలక్ష్మి, అనంతగిరి ఎంపీపీ శెట్టి నీలవేణి, కృష్ణాపురం సర్పంచ్ ఎం.యామినీదేవి, ఎస్.కోట వార్డు సభ్యురాలు కె.భారతి, ఏఎంసీ డైరెక్టర్ డి.పార్వతి బుధవారం ఇంటింట ప్రచారం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్ మహిళలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించడంతో పాటు, మహిళలే లబ్ధిదారులుగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎస్.కోట ఎమ్మెల్యేగా శ్రీనివాసరావును, విశాఖపట్నం ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిను గెలిపించాలని కోరారు.

ఉపాధి పనులపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న ఉపాధి అధికారులు

మెరకముడిదాం: ఉపాధి పనుల్లో భాగంగా ఉద్యానవన పనుల నిర్వహణపై సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులు దృష్టి సారించాలని డ్వామా అధికారి చిన్నంనాయుడు, ఇన్‌చార్జ్ ఏపీఓ నరేంద్రకుమార్ సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలానికి చెందిన క్షేత్ర సహాయకులు, సాంకేతిక సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యానవన పంటలు జీడిమామిడి, కొబ్బరి, సపోటా పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఫారంపాండ్స్ తవ్వేలా రైతులకు ప్రోత్సహించాలన్నారు. అలాగే ఉపాధి పనులు నిర్వహించే ప్రదేశంలో టెంట్లు, ప్రథమచికిత్స కిట్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తున్న క్షేత్ర, సాంకేతిక సహాయకులపై శాఖా పరమైన చర్యలు తప్పవన్నారు.

విచిత్ర దూడ జననం

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి పశు వైద్య కళాశాలలో జన్యుపరమైన లోపంతో ఆడ దూడ బుధవారం జన్మించింది. రెండు తలలు, రెండు తోకలు, రెండు ముందరి కాళ్లు, నాలుగు వెనుక కాళ్లు, మూడు నాలుకలతో జన్మించింది. అంతే కాకుండా పేగులు, కాలేయం బయటకు వచ్చి ఉన్నాయి. గుర్ల మండలం గొలగాం గ్రామానికి చెందిన ఒకరు ఈనుటకు ఇబ్బంది పడుతున్న తన ఆవును పశువైద్య కళాశాలకు తీసుకువచ్చారు. వెంటనే సిబ్బంది ఆవుకు సిజేరియన్ చేసి జన్యుపరమైన లోపంతో ఉన్న దూడను బయటకు తీశారు.

ప్రజాసంక్షేమమే పరమావధి



శ్రీనివాసకాలనీలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

శృంగవరపుకోట: ప్రజాసంక్షేమమే పరమావధిగా పాలన సాగించిన సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ప్రజలను కోరారు.బుధవారం రాత్రి ఎస్.కోట పట్టణంలో శ్రీనివాసకాలనీలో ఎన్నికల ప్రచారం చేశారు. ఎమెల్యేకు కాలనీ వాసులు ఘనస్వాగతం పలకగా, మహిళలు ఎమ్మెల్యేకు కుంకు మ దిద్ది, హారతులిచ్చారు. మే13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యేగా తనని, విశాఖపట్నం ఎంపీ బొత్స ఝాన్సీ లక్ష్మిని గెలిపించాలని అభ్యర్థించా రు. మాజీ ఎమ్మెల్యే హైమావతి, జెడ్పీటీసీ ఎం.వెంక టలక్ష్మి, అనంతగిరి ఎంపీపీ శెట్టి నీలవేణి, పార్టీ మండల అధ్యక్షుడు మోపాడ కుమార్, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ రహ్మాన్, స్టేట్‌ఫోక్ అకాడమీ డైరెక్టర్ వి.రాంబాబు, కృష్ణాపురం సర్పంచ్ ఎం.యామినీదేవి, ఏఎంసీ డైరెక్టర్ డి.పార్వతి, వార్డు మెంబర్ కె.భారతి, మండల నాయకులు పాల్గొన్నారు.

చింతలపేటలో అభివృద్ధి బాట..

- జోరుగా అభివృద్ధి పనులు
- సంక్షేమ పథకాలతో రూ 15.95 కోట్ల లబ్ధి



చింతలపేట సచివాలయం



వెల్‌నెస్ కేంద్రం



చింతలపేట రైతుభరోసా కేంద్రం



ఎస్‌సీ కాలనీలో వేసిన సీసీ రోడ్డు

గుర్ల: నిత్యం తగాదాలు, సమస్యలతో సతమతమయ్యే గ్రామం నేడు అభివృద్ధిపథంలో దూసుకుపోతోంది. గత ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండే చింతలపేట నేడు ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలి చింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామంలో సచివాలయం ఏర్పాటు చేశారు. దీంతో ఇంటి వద్దనే పాలన అందుతోంది. ప్రతి చిన్న పనికీ మండల, జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పోయింది. అర్హులందరికీ సంక్షేమ పథకాలు సచివాలయ సిబ్బంది అందిస్తున్నారు.సచివాలయం పరిధిలో సుమారు రూ. రెండు కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. రూ.66 లక్షల తో సీసీ రోడ్లు, కాలువలు నిర్మించారు. రూ.40 లక్షలతో సచివాలయం, రూ.21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.18 లక్షలతో వెల్‌నెస్ కేంద్ర భవనాలు ఏర్పాటు చేశారు. సొంత స్థలాలు ఉన్న 82 కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేశారు. వీరికి ఇళ్ల నిర్మాణాల కోసం రూ.కోటీ 47 లక్షలను బిల్లులు రూపంలో కేటాయించారు. గ్రామంలోని ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను 'నాడు-నేడు' కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి చేశారు. ఇందుకోసం సుమారు రూ. 65 లక్షలు కేటాయించారు. అలాగే ఆనందపురం నుంచి చింతలపేట మీదుగా నెల్లిమర్ల మండలం పూతికపేట వరకు రూ.4 కోట్ల 54 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేశారు. లోఓల్టేజీ సమస్యతో వ్యవసాయ మోటార్లు కాలిపోవడంతో పాటు విద్యుత్ సరఫరాకు ప్రతి రోజు ఆటంకం రావడంతో రైతుల కోసం నూతనంగా 40 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. చింతలపేట సచివాలయ పరిధిలో ప్రజలకు నేరుగా (డీబీటీ) 15 కోట్ల 95 లక్షల 26 వేల 972 రూపాయల లబ్ధి చేకూరగా.. నాన్ డీబీటీ ద్వారా రూ. 3.92 కోట్ల లబ్ధి చేకూరింది.



వెల్‌నెస్ కేంద్రానికి వేళ్లే సీసీ రోడ్డు



సచివాలయం వద్ద వేసిన సీసీ రోడ్డు



నాడు-నేడులో అభివృద్ధి చెందిన చింతలపేట ప్రాథమిక పాఠశాల

అభివృద్ధికి బాటలు..



చింతలపేట గ్రామంలో అభివృద్ధికి బాటలు వేయడంతో పాటు అర్హులైనా వారిందరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నాం. సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ పరిష్కరిస్తున్నాం. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలందరికీ అవసరమైన సేవలను గ్రామంలోనే అందిస్తున్నాం.

పతివాడ భాస్కరరావు,
సర్పంచ్ , చింతలపేట



రైతుల కోసం ఏర్పాటు చేసిన 40 కేవీ ట్రాన్స్‌ఫార్మర్

పరువు నష్టం కేసు వేస్తా..

గజపతినగరం: రైతులను మోసం చేయడం,భూములను లాక్కోవడం, కబ్జాలు చేయడం వంటి పనులు తాను ఏనాడూ చేయలేదని, ఆ అవసరం నాకు లేదని పంచాయతీరాజ్ శాఖ విశ్రాంత జేఈ బెవర నాగేశ్వరరావు అన్నారు. గజపతినగరం పర్ణశాల వద్ద బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్నేళ్లుగా తాను రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటున్నానని, ఇటీవల గజపతినగరంలో మేడిశెట్టి కుటుంబ సభ్యులు వెంకట సత్యనాగకుమారి, శ్రీరామ్మూర్తి, శేషగిరి, శ్రీనివాసరావు తదితరుల నుంచి జిరాయితి భూమిని కొనుగోలు చేసి, డబ్బులు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నానని చెప్పారు. ఈభూమిని తాను కబ్జా చేశానని వారి కుటుంబ సభ్యుల్లో ఒక మహిళ సుబ్బలక్ష్మి బొండపల్లిలో మంగళవారం నిర్వహించిన మహిళాగళం సదస్సులో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకు అబద్దాలు చెప్పారని, కబ్జానే జరగని భూముల విషయంలో ఎమ్మెల్యే అప్పలనరసయ్య హస్తం కూడా ఉందని చెప్పడం దుర్మార్గమన్నారు. రాజకీయం కోసం తాను దగా చేశానని అబద్దపు మాటలు చెప్పిన మహిళపై హైకోర్టులో పరువు నష్టం కేసు వేస్తానని ఆయన చెప్పారు. తనకు ఎమ్మెల్యే అప్పలనరసయ్యకు ఎటువంటి సంబంధం లేదని, అనవసరంగా ఆయనపై నిందలు వేయవద్దని కోరారు. తాను తప్పు చేసినట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధమని నాగేశ్వరరావు సవాల్ విసిరారు. అనవసరంగా నోరుందని వాగితే సహించేది లేదని అన్నారు.